ప్రజాశక్తి
బుధవారం 26 ఏప్రిల్ 2023
5
శ్రీకాకుళం

## గంగా పుష్కరాలకు రెండు ప్రత్యేక బస్సులు

**శ్రీకాకుళం :** గంగా నది పుష్కరాలకు వెళ్లే యాత్రికుల కోసం రెండు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం రెండో డిపో నుంచి ఈనెల 27, 30 తేదీల్లో సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు. పుష్కరాల కోసం ఇప్పటికే పలాస నుంచి వారణాశికి ఈనెల 23వ తేదీన ప్రత్యేక బస్సు వెళ్లిందని తెలిపారు. ప్రయాణికుల నుంచి స్పందన ఎక్కువగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రత్యేక సర్వీసుల్లో ముందుగా రిజర్వు చేయించుకునే సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో టిక్కెట్లు లభిస్తాయని తెలిపారు. పూర్తి వివరాలకు డిపో మేనేజర్ 9959225608, అసిస్టెంట్ మేనేజర్ 7095040608 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# అనుసంధానం పూర్తయ్యేనా?

- ఆగస్టులో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- ఇప్పటివరకు 75 శాతం పనులు పూర్తి
- పనుల వేగవంతంపై దృష్టిసారించిన అధికారులు

**ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈనెల 19న జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో ఆగస్టులో హైలెవల్ కెనాల్‌ను ప్రారంభించినున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో వంశధార, నాగావళి నదుల అనుసంధానం (హైలెవల్ కెనాల్) పనులు వేగవంతం చేయడంపై అధికారులు దృష్టిసారించారు. ఇప్పటికే పనులను తొందరగా పూర్తి చేయాలని నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు సైతం మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు 75 శాతం మేర పనులు పూర్తయ్యాయి. మరో 25 శాతం మేర పనులను మూడు, నాలుగు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులో గతంలో తీవ్ర జాప్యం జరగడంతో ప్రస్తుతం పనులు చేపట్టడానికి పెద్దగా ఆసక్తి కనబరచడం లేదని తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే పనులు సకాలంలో పూర్తి కావడం సందేహంగానే ఉంది. కెనాల్ ప్రారంభోత్సవ సమయానికి పనులు పూర్తవుతాయని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార, నాగావళి నదుల అనుసంధానంలో భాగంగా హిరమండలం రిజర్వాయర్ గట్టుకు రెండు తూములు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 33.58 కిలోమీటర్ల మేర నారాయణపురం వరకు కాలువ తవ్వాల్సి ఉంది. హిరమండలం వద్ద నీటిని సరఫరా చేసే చోట 43.7 మీటర్ల స్థాయిలో, నారాయణపురం ఆనకట్ట వద్ద కాలువ కలిసే చోట 29.09 మీటర్లు నిర్మించేలా డిజైన్ చేశారు. తద్వారా ఏటవాలుగా నీరు ప్రవహించి ఆనకట్టకు చేరుతుంది. నదుల అనుసంధానం పూర్తి చేస్తే ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో ఉన్న ఐదు వేల ఎకరాలకు సాగునీరందుతుంది. దీంతోపాటు నారాయణపురం ఆనకట్ట ప్రధాన కాలువల కింద నున్న 37,053 ఎకరాల ఆయుకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

అసంపూర్తిగా హైలెవల్ కెనాల్ పనులు

### పెరిగిన ప్రాజెక్టు వ్యయం

వంశధార, నాగావళి నదుల పనులను రూ.84.90 కోట్ల వ్యయంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి.వి రమణయ్య అండ్ కంపెనీకు రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించిన ప్రభుత్వం, ఈ ఏడాది మార్చి 31 నాటికి పూర్తి చేసేలా పొడిగించింది. అంచనా వ్యయాన్ని సవరించి రూ.145.34 కోట్లకు పెంచింది. ఇప్పటివరకు రూ.85.71 కోట్లను వెచ్చించారు.

### ఆసక్తి చూపని కాంట్రాక్టర్

అనుసంధాన పనులకు సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.13 కోట్లు చెల్లించాల్సి ఉంది. గతేడాది డిసెంబర్ వరకు చేపట్టిన పనులకు సంబంధించి రూ.11 కోట్ల వరకు చెల్లించింది. మార్చిలో బిల్లులు చెల్లించినా, పనులు కొనసాగింపునకు సంబంధిత కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. అధికారులు పలుమార్లు నోటీసులిచ్చినా స్పందించలేదు. జలవనరులశాఖ అధికారులు చివరిగా పెనాల్టీ నోటీస్ జారీ చేశారు. కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులు విడిచిపెట్టి వెళ్లిన సందర్భంలో కొత్తగా పనులు చేపట్టే నిర్మాణ సంస్థకు అయ్యే అదనపు ఖర్చును ప్రస్తుత కాంట్రాక్టరే భరించాల్సి ఉంటుంది. దీంతో పి.వి రమణయ్య అండ్ కో కంపెనీ దిగొచ్చి పనులను ప్రారంభించింది. పనులు చేస్తున్నా పెద్దగా ఆసక్తి కనబరచడం లేదు.

### కాలువ పనులకు తొలగిన అడ్డంకులు

బూర్జ మండలం చినలంకాంలో కాలువ నిర్మాణం కోసం దేవాదాయ, ధర్మాదాయశాఖకు చెందిన సుమారు 7.5 ఎకరాలు అవసరమైంది. వంశధార అధికారులు పరిహారం కింద దేవాదాయ, ధర్మాదాయశాఖకు రూ.1.50 కోట్లు చెల్లించేశారు. భూముల్లో 13 మంది రైతులు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. చట్టం ప్రకారం పరిహారంలో 60 శాతం దేవాదాయ, ధర్మాదాయశాఖకు, 40 శాతం కౌలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. కౌలు రైతులకు పరిహారం చెల్లింపునకు సిద్ధమవుతున్న తరుణంలో ఆ భూములకు దేవాలయానికి ఇచ్చిన ధర్మదాత పరిహారం ఇవ్వాల్సి వస్తే తనకు ఇవ్వాలని, లేకుంటే దేవాదాయశాఖకు చెందాలంటూ కోర్టును ఆశ్రయించాడు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ జోక్యం చేసుకుని రైతులకు న్యాయమైన పరిహారం ఇస్తామంటూ ఒప్పించారు.

## ఎన్నాళ్లకు పూర్తి చేస్తారు?

- ఇళ్ల నిర్మాణాల్లో జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం
- డిఇ, ఎఇలకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గృహ నిర్మాణాలను జాప్యం చేస్తున్నారని, ఎప్పటికి పూర్తి చేస్తారని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ హౌసింగ్ అధికారులను ప్రశ్నించారు. గృహ నిర్మాణాలు, జగనన్న కాలనీల్లో ఆర్చీల నిర్మాణాలు తదితర వాటిపై గృహనిర్మాణ సంస్థ ఇంజినీర్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ప్రగతిపై సమీక్షించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గృహ నిర్మాణాలు పూర్తి కాకపోవడంపై సంబంధిత ఇంజినీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతి సాధించకపోవడంపై డిఇ, ఎఇలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ బదిలీలకు చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణ సంస్థ పీడీ గణపతిరావును ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఆర్చీల ఎలాట్‌మెంట్ రెండు రోజుల్లో శత శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. నిధులు అందుబాటులో ఉన్నా ఇంతవరకు ఏజెన్సీలకు ఎలాట్‌మెంట్ చేయలేదన్నారు. వచ్చే రెండు రోజుల్లో ఏజెన్సీలకు ఎలాట్‌మెంట్ చేయకపోతే పీడీపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. 3,959 గృహాలను మే పదో తేదీ నాటికి పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తయిన గృహాలకు నీరు, విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలన్నారు. నిర్మాణాలపై ఎప్పటికప్పుడు ఇఇలు సమీక్షిస్తూ ఉంటే ఇంత అలసత్వం ఉండదన్నారు. ఇఇలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పీడీని ని ఆదేశించారు. దశల వారీగా నిర్మించిన గృహ నిర్మాణాలకు బిల్లులు పెట్టాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణ సంస్థ ఇఇలు, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

## స్టోన్ ప్లాంటేషన్ తనిఖీ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని పూర్ణాటకంలో జగనన్న భూ హక్కు స్టోన్ ప్లాంటేషన్ పనులను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మంగళవారం తనిఖీ చేశారు. స్టోన్ ప్లాంటేషన్ నత్తనడకన సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు బొడ్డబడలో 681, బొడ్డకాలి 973, పూర్ణాటకం 1309, అరకభద్ర 190, శాసనం 1252, టి.బరంపురం 1173, మునుభద్ర 1976, కేదారిపురం 1563 సర్వే రాళ్లు వచ్చాయని చెప్పారు. ఇందులో ఇప్పటివరకు 86 శాతం ప్లాంటేషన్ చేసినట్లు తహశీల్దార్ గురుప్రసాద్ ఆదేశించారు. ప్లాంటేషన్‌ను వేగవంతం చేయాలని, హద్దులూ కచ్చితంగా ఉండాలని జెసి ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరి, రెవెన్యూ అధికారి శ్రావణ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న జెసి నవీన్

ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌ను నిలదీస్తున్న పున్నాం గ్రామస్తులు

## ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కు నిరసన సెగ

ప్రజాశక్తి - జి.సిగడాం

మండలంలోని పున్నాం గ్రామ సచివాలయం పరిధిలోని బూటుపేట, పున్నాంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కు నిరసన సెగ తగిలింది. ఎన్నికల సమయంలో గ్రామానికి రహదారి, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామని హామీనిచ్చి, ఇప్పటివరకు ఏదీ నెరవేర్చలేదని గ్రామస్తులు ఎమ్మెల్యేను నిలదీశారు. వీధుల్లో కాలువలు సరిగ్గా లేక అవస్థలు పడుతున్నామని చెప్పారు. వారం రోజుల్లో మంచినీటి బోరు వేయిస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

మండలంలోని రొతుపేటలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.15 లక్షల ఇంటింటికీ కుళాయిలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల సత్యవతి, జెడ్‌పిటిసి కాయల రమణ, వైసిపి మండల అధ్యక్షులు బూరాడ వెంకటరమణ, జెసిఎస్ మండల కన్వీనర్ డోల వెంకటరమణ, పిఎసిఎస్ చైర్మన్ ఎ.ప్రకాష్, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మక్కా వెంకటసాయి, ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ శాఖ ఎఇలు భాగ్యలక్ష్మి, తిరుపతిరావు, ఎపిఒ సత్యనారాయణ, ఎపిఎం రెడ్డి రామకృష్ణ నాయుడు, వైసిపి నాయకులు మీసాల వెంకటరమణ, మామిడి బలరాం తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

## మలేరియాపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మలేరియాపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద అవగాహనా ర్యాలీని జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. ర్యాలీ పాలకొండ రోడ్డు మీదుగా ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటు లేనిదే మలేరియా రాదన్నారు. మలేరియా సోకిన వారిలో చలి, వణుకు, విపరీతమైన జ్వరం ఉంటాయన్నారు. మలేరియా లక్షణాలు ఉంటే తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకుని సకాలంలో వైద్యం తీసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. గర్భిణులు, పిల్లలకు సకాలంలో పరీక్షలు చేసి మందులు వాడాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా, ఆరోగ్య కార్యకర్తలు మలేరియాను నిర్ధారించేందుకు ఇప్పటికే ర్యాపిడ్ డయాగ్నస్టిక్ కిట్లను సరఫరా చేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దోమ తెరలు వాడాలని, ఇళ్లలో క్రిమి సంహారక మందు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి అనురాధ, జె.కృష్ణమోహన్, డిఐఒ ఆర్.వి.ఎస్ కుమార్, జిల్లా మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ, సబ్జెక్టు అధికారి సూర్యం, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, స్వచ్ఛంద సేవకులు మంత్రి వెంకటస్వామి, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు అవసరమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, పెన్షనర్ల సంఘం నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యాన ఉద్యోగులు నగరంలోని రెవెన్యూ అతిథిగృహం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ధర్నాకు సంఘీభావం తెలిపిన అనంతరం వారు మాట్లాడారు. ఉద్యోగులకు బకాయి పడిన డిఎ, ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. జెఎసి అమరావతి జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు మాట్లాడుతూ 50 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచామని, వాటిని పరిష్కరించి ఉద్యోగులకు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో, ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు.

సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, న్యాయసమ్మతంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. నాలుగేళ్లుగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలన్నింటినీ చెల్లించాలని కోరారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొస్తే ఆరు నెలల్లోనే సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీనిచ్చినా నేటికీ రద్దు చేయలేదని విమర్శించారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలను పెంచాలన్నారు. ఉద్యోగుల హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కరోనా ముందు కరోనా సమయంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియమాకాలను వెంటనే చేపట్టాలని కోరారు. ఆర్‌టిసి ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఒటి, నైట్ డే అవుట్ అలవెన్స్, విలీనం అనంతరం తొలగించిన సౌకర్యాలన్నీ కొనసాగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి అమరావతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ, జిల్లా అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, మహిళా శాఖ చైర్మన్ ప్రవల్లికా ప్రియ, రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాల్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు మురళీధర్ నాయక్, కోశాధికారి జి.ఎల్.ఇ శ్రీనివాసరావు, శ్రీకాకుళం యూనిట్ కార్యదర్శి డి.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

## పీపుల్స్ సర్వేలో అపూర్వ ఆదరణ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మెగా పీపుల్స్ సర్వేలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అపూర్వ ఆదరణ లభిస్తోందని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని కొఠారిలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీపుల్స్ సర్వేలో రాష్ట్రంలో కోటి కుటుంబాలను కలిసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 7 లక్షల మంది వైసిపి సైనికులు ప్రతి ఇంటినీ సందర్శిస్తున్నారని చెప్పారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇంతవరకు 90,256 కుటుంబాలను సందర్శించామని, 95 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. సిఎం జగన్ పాలనకు మద్దతుగా 80 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. నవరత్నాల హామీలను వంద శాతం నెరవేర్చిన జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. సమావేశంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర రెడ్డి, ఎంపిపి బోర పుష్ప, కంచిలి ఎంపిపి పైలా దేవదాస్ రెడ్డి, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, దువ్వు వివేకానందరెడ్డి, కారంగి మోహనరావు, ఉప్పాడ రాజారెడ్డి, సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, పి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

## వ్యవసాయ పరిశోధనలు పెరగాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయం లాభసాటి అయ్యేలా ఉత్తర కోస్తా జిల్లాల్లో వ్యవసాయ పరిశోధనలు పెరగాలని గుంటూరు ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి అన్నారు. ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నగరంలోని అంబేద్కర్ కళావేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యాన ఉత్తర కోస్తా మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి రెండు రోజుల సమావేశాలు మంగళవారంతో ముగిశాయి. చెరుకు, మెట్ట వ్యవసాయం, యాంత్రీకరణ, ఉద్యాన పంటలు, ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్ర అధిపతులతో విస్తరణ అంశాలపై ప్రధాన శాస్త్రవేత్తలు చర్చించారు. తొలకరిలో అధునాతన రకాలు ఎంటియు 1239, ఎంటియు 1318తో పాటు నేరుగా విత్తే వరి విధానంలో యంత్రాల లభ్యత ఫెర్టి కమ్ సీడ్డ్రిల్‌లు పెరగాలన్నారు.

వరిలో పొటాషియం, జీవ ఎరువుల వాడకంతో పాటు చిరుధాన్యాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు పెరగాలని చెప్పారు. పప్పు జాతి పంటల్లో కొత్తరకాలు ఎల్‌జిజి 574, ఎల్‌జిజి 607, జిబిజి 884, జిబిబి-1 వాడాలని సూచించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్ల మెట్ట పరిస్థితులకు తగ్గ రకాలను తొలకరి ఆరుతడి పంటల్లో ఎంచుకోవాలన్నారు. చెరుకులో మంచి బెల్లం దిగుబడికి 2009 ఎ 252 రకం వాడాలన్నారు.

విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బిరామిరెడ్డి మాట్లాడుతూ వరి మాగాణి మొక్కజొన్నలో డిఎపి, యూరియా కలిపిన ద్రావణం మొదల్లో పోయటం చేయాలన్నారు. ఉత్పాదకత పెరిగి ఖర్చులు తగ్గే విధానాల్లో మొక్కజొన్న, వేరుశనగ సాగు చేయాలన్నారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.వి.కె జగన్నాథరావు మాట్లాడుతూ ఉత్పత్తి, దిగుబడులు, విలువ, ఉత్పత్తి, చిరుధాన్యాలు చెరుకు పంటల్లో చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో నాలుగు జిల్లాల శాస్త్రవేత్తలు, జిల్లా అధికారులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ పీడీగా జయదేవి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఐసిడిఎస్ పీడీగా జి.జయదేవి నియమితులయ్యారు. ప్రాజెక్టు డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆమె జిల్లాలోని భూసేకరణ యూనిట్-4 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమె 2019 సెప్టెంబరు నుంచి రెండున్నరేళ్ల పాటు ఐసిడిఎస్ పీడీగా పనిచేశారు. ఇప్పటివరకు ఐసిడిఎస్ పీడీగా పనిచేసిన కె.అనంతలక్ష్మిని ఈనెల 24వ తేదీన కలెక్టర్ సరెండర్ చేసిన విషయం తెలిసిందే. ఖాళీ అయిన ఆ స్థానంలో జయదేవిని నియమించారు.

### అనంతలక్ష్మి సరెండర్‌కు కారణాలు ఇవే...

పూర్వ పీడీ కె.అనంతలక్ష్మి పనితీరుపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఈనెల 19వ తేదీన మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాశారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారత అధికారిగా గతేడాది ఏప్రిల్ నాలుగో తేదీన విధుల్లో చేరారని, ఏడాది సర్వీసు పూర్తి చేసుకున్న రూల్ పొజిషన్, ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన లేదని, ప్రతి విషయానికి కిందిస్థాయి సిబ్బందిపై ఆధారపడతారని లేఖలో పేర్కొన్నారు. ఐసిడిఎస్ కార్యక్రమాలు, రూల్ పొజిషన్ అంశాలపై అవగాహన పెంచుకునేందుకు, జిల్లా పరిపాలనా యంత్రాంగం అనేక అవకాశాలు కల్పించినా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ నోటిఫికేషన్‌ను సకాలంలో ఇవ్వలేకపోయారని, సమీక్షా సమావేశాల్లో ఆమె పనితీరు అధ్వానంగా ఉందన్నారు. ఈ కారణాల దృష్ట్యా ఆ పోస్టుకు ఆమె సరైన వ్యక్తి కారని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఐసిడిఎస్ పీడీగా జిల్లాకు ఆమె సేవలు అవసరం లేదని, ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పీడీగా సరైన వ్యక్తిని తొందరలోనే నియమించేలా అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ నేపథ్యంలోనే అనంతలక్ష్మి సరెండర్, పీడీగా జయదేవి నియమితులయ్యారు.

## మినీ గోకులాల బిల్లులను చెల్లించాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

మినీ గోకులాల బిల్లులను రైతులకు చెల్లించాలని పశుసంవర్ధకశాఖ జెడి ఎం.కిషోర్ అన్నారు. పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో నాలుగు మండలాల పశు వైద్య సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ గోకులాలను పూర్తి చేసిన రైతుల ఎం బుక్‌ల రికార్డులను సరిచూసి బిల్లులను వెంటనే చెల్లించాలని సిబ్బందిని ఆదేశించారు. పశువులకు వచ్చే వ్యాధులు వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పాడి రైతులకు కృత్రిమ గర్భధారణపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండి వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల ద్వారా పశువుల మరణాల శాతాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఎం.జగన్నాథం, అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్.సుబ్రమణ్యం, బాలకృష్ణ, ఆనందరావు, పశు వైద్యులు హేమలత, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య సిబ్బందితో సమీక్షిస్తున్న జెడి కిషోర్

## ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - పలాస / మెళియాపుట్టి

రేగులపాడు ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి హామీనిచ్చారు. పలాస మండలం రేగులపాడు, మెళియాపుట్టి మండలం చీపురుపల్లి ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. చీపురుపల్లిలో కొంతమంది నిర్వాసితులతో మాట్లాడి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమావేశం నిర్వహించేందుకు చర్యలు చేపడతానన్నారు. సిపిఐ జిల్లా నాయకులు చాపర వెంకటరమణ మాట్లాడుతూ రైతులు, నిర్వాసితుల సమస్యలపై కాలయాపన చేయడం తగదన్నారు. సమస్యలు పరిష్కరించిన తర్వాతనే పనులు చేయాలని స్పష్టం చేశారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తామని, పనులకు ఎటువంటి ఆటంకాలు కలిగించవద్దన్నారు. రేగులపాడు నిర్వాసితులకు 14 మందికి ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు పలాస తహశీల్దార్ మధుసూదనరావును ఆదేశించారు. కార్యక్రమంలో మెళియాపుట్టి తహశీల్దార్ టి.సరోజని, సర్పంచ్ వై.ఈశ్వరరావు, సిపిఐ నాయకులు సోమేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

## అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

### శాసనసభ స్పీకర్ సీతారాం

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి దూసుకుపోతున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొరపాం పంచాయతీలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం విషయంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వాలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రజల ముంగిటకు పాలనను తీసుకువచ్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలిచిందని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం నవరత్నాల పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మెట్ట శారద, వైసిపి నాయకుడు నక్క కన్నబాబు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పత్రాలను అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మి

## సోషల్ క్లబ్‌కు రిజిస్ట్రేషన్ చేయొద్దు

**ప్రజాశక్తి- పొందూరు**

పొందూరు మేజర్ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో ఉన్న సోషల్ క్లబ్‌ను కొంతమంది తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దీని రిజిస్ట్రేషన్‌ను అనుమతించవద్దని సర్పంచ్ రేగడి లక్ష్మి, సోషల్ క్లబ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సబ్ రిజిస్టర్ కనకరత్నమును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రికార్డుల్లో సర్వే నంబరు 188 పోరంబోకు స్థలంగా నమోదై ఉందన్నారు. ఇందులో ఉన్న నిర్మాణం పంచాయతీ పేరున ఉందని పేర్కొన్నారు. ఇందులో సోషల్ క్లబ్ నిర్వహించే వారని, ప్రస్తుతం ఇది ఖాళీగా ఉండడంతో తప్పుడు పత్రాలు సృష్టించి వేరే వారికి రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. అందుకు ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అందుకే రిజిస్ట్రేషన్ కాకుండా చూడాలని కోరారు. సోషల్ క్లబ్‌కు సంబంధించిన ఆధారాలను, రికార్డు పత్రాలను సర్పంచ్, ఉపసర్పంచ్ గోవిందరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, సూరిబాబు అందజేశారు.

# గంగువాడలో దాహం కేకలు

### బావిలో అడుగంటిన నీరు

**ప్రజాశక్తి- పలాస**

ఆ గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. నీటి కోసం అక్కడ ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. గ్రామమంతటికీ ఒకే బావి కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి సమస్య ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోయింది. మండలంలోని గంగువాడలో 200 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో గంగువాడ, గంగువాడ కాలనీ, దళిత వీధులు ఉన్నాయి. ఎక్కువగా గంగువాడ కాలనీలో నీరు కోసం నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఒకే ఒక్క బావి ఉండడంతో గ్రామస్తులందరూ అక్కడ నుంచే నీరు తీసుకు వెళ్తుంటారు. ప్రస్తుతం వేసవి కావడంతో బావిలో నీరు రోజు రోజుకూ తగ్గిపోతుంది. చివరకు గ్రామస్తులంతా కలిసి బావి వద్ద స్నానాలు, దుస్తులు ఉతకరాదని బోర్డు పెట్టారంటే అక్కడ పరిస్థితి ఏలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొంత మంది సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల పలాసలో జరిగిన ఆసరా సమావేశంలో మా గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని మంత్రి సీదిరి అప్పలరాజు దృష్టికి మహిళలు తీసుకువెళ్లారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటికీ అమలు కాకపోవడంతో మహిళలు పెదవి విరిచారు. గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, కొంత మంది ఇంటి వద్ద సొంతంగా వేసుకున్న బోర్లు నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. అలా అని ప్రతిసారీ నీటిని అడిగేందుకు ఇబ్బందిగా ఉందని మహిళలు చెబుతున్నారు. వాస్తవానికి వేసవిలో నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ, ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీరు కష్టాలు తప్పడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రామంలో ఉన్న బావి (ఇన్‌సెట్)లో అడుగంటిన నీరు

గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని అధికారులు గుర్తించి ఇటీవల పంచాయతీ నిధులతో నాలుగు బోర్లు తవ్వారు. రెండు ప్రాంతాల్లో బోర్లు పాడైనట్లు తెలుస్తోంది. బోర్లు తవ్వినప్పటికీ పైపులు, కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో బోర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఏదేమైనాప్పటికీ ఒక వైపు నీటి ఎద్దడి, మరో వైపు బోర్లు తవ్వినా పైపులు కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో ఆ ప్రాంత ప్రజలకు నీటి కోసం కష్టాలు తప్పడం లేదు. ఈ విషయంపై ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడును వివరణ కోరగా గంగువాడలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని మా దృష్టికి వచ్చింది. తాగునీటి సమస్య పరిష్కారానికి నాలుగు బోర్లు తవ్వించాం. అందులో రెండు బోర్లలో నీరు పడలేదన్నారు. రెండు మూడు రోజుల్లో తవ్విన బోర్లు నుంచి ప్రజలకు నీరు సరఫరా చేసేవిధంగా చర్యలు చేపడతామని చెప్పారు.

### ఇబ్బందులు పడుతున్నాం

తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఒక్క బావి నుంచే గ్రామమంతా నీరు తెచ్చుకుంటున్నాం. నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు, పాలకులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. దూర ప్రాంతం నుంచి నీటిని తెచ్చుకుని దాహార్తిని తీర్చుకుంటున్నాం.

**– రీసి ఈశ్వరమ్మ, గంగువాడ**

### ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి

గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. కాలనీ వైపు ఎక్కడ బోర్లు తవ్వినా నీరు పడడంలేదు. నీరు కోసం మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. పలుమార్లు అధికారులు, పాలకులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది.

**– పైల మోహనరావు, గంగువాడ**

## బిజెపి విధానాలను వ్యతిరేకిద్దాం

**ప్రజాశక్తి- పలాస**

ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న మోడీ నిరంకుశ విధానాలను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, మండల కార్యదర్శి ఎన్.గణపతి పిలుపునిచ్చారు. ప్రచార భేరీ కార్యక్రమంలో భాగంగా పలాసలోని శివాజీ నగర్, శ్రీనివాస నగర్, లేబర్ కాలనీ, పరిసర వీధుల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపద దోచిపెట్టి ప్రజలపై భారాలు మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మకాలు పెట్టి కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేశారని, విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా కేంద్రం దగా చేస్తుందని అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటు పరం కాకుండా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రచారం ముగింపు దశలో ఈ నెల 29న కాశీబుగ్గలో బహిరంగసభ నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.గోవింద్, రమణ, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

పోలాకి : ప్రచారం చేస్తున్న నాయకులు

**పోలాకి :** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ప్రజలను చైతన్యం చేయడానికి సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన పోలాకిలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు లక్కోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలోని అన్ని రంగాల్లో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. పేదలను దోచి అదానీల వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపద కట్టబెట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంలో దేశాన్ని కాషాయ మయం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కె.శ్రీనివాసరావు, నిమ్మడ కృష్ణ, భాస్కరరావు, లక్ష్మి, వెంకట్, కాంతారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలాస : ప్రచారం చేస్తున్న నాయకులు

**శ్రీకాకుళం అర్బన్ :** పట్టణ ప్రాంతాల్లో నివాస ముంటున్న పేదలకు ఉపాధి హామీ చట్టం వర్తింపజేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త ప్రచార భేరిలో భాగంగా 12వ రోజు నగరంలో తూర్పు గుమ్మాలవీధి, కుమ్మరి వీధి, అరసవల్లి ప్రాంతాల్లో ఇంటింట ప్రచారం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నగర కార్పొరేషన్‌లోని మురుగువాడల్లో సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం అరసవల్లి శివారులోని ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కె.భాస్కరరావు, ఎస్.శ్రీనివాసులు, పి.ప్రభావతి, బి.రామారావు, జి.అప్పారావు, పి.ప్రసాద్, నారాయణ, విష్ణు, లక్ష్మి, కొండయ్య, లక్ష్మణ పాల్గొన్నారు.

గంజాయిని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజేష్

### గంజాయి పట్టివేత

**మెళియాపుట్టి :** స్థానిక మూడు రోడ్ల కూడలి వద్ద మంగళవారం అక్రమంగా తరలిస్తున్న 7 కేజీల 600 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. గజపతి జిల్లా చెడిపడాకు చెందిన బాలుమాలిక్ అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందని అన్నారు. ఈ మేరకు దాడులు చేపట్టి గంజాయిని పట్టుకున్నామని తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో ఎఎస్ఐ నర్సింగరావు, సిబ్బంది ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శేషు

### ఐఫీడ్‌తో ఆక్వాలో అధిక దిగుబడులు

**ప్రజాశక్తి- సంతబొమ్మాళి**

ఆక్వాకల్చర్ రంగంలో ఐఫీడ్ వాడడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఐఫీడ్ డైరెక్టర్ శేషు అన్నారు. మండలంలోని నిమ్మాడలో ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో ఆక్వాకల్చర్ రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రొయ్యల మేత కోసం ఐఫీడ్ వాడినట్లయితే తక్కువ సమయంలో రొయ్యలు పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. అనంతరం అధిక ఉత్పత్తులు సాధించిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో డీలర్లు ఎస్.యల్లారావు, దుర్గాప్రసాద్, రైతులు జోగి రాములమ్మ, కెల్లి జగన్నాయకులు, పిలక రవికుమార్, చింతు రామారావు పాల్గొన్నారు.

### ఒక్క అవకాశం ఇవ్వండి

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

లోకేష్‌కు దరఖాస్తు అందజేస్తున్న శంకర్

రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యమని, అందువల్ల పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న యువతకు 40 శాతం టిక్కెట్లు కేటాయించాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ అభ్యర్థించారు. కర్నూలు జిల్లా కొసగి క్రాస్ మంత్రాలయం వద్ద పాదయాత్రలో ఉన్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మంగళవారం కలిశారు. రానున్న ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గం టిక్కెట్టు తనకు కేటాయించాలని దరఖాస్తు అందజేశారు. అనంతరం ఆయనతో మాట్లాడుతూ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

### ఎఎంసి ఛైర్మన్‌గా మోహనరావు

మోహనరావు

**సోంపేట :** కంచిలి ఎఎంసి నూతన ఛైర్మన్‌గా మండలంలోని కొరంజిభద్ర పంచాయతీ సుంకిడికి చెందిన సీనియర్ వైసిపి నాయకుడు బతకల మోహనరావు మంగళవారం నియమితులయ్యారు. ఈయనతో పాటు వైస్ ఛైర్మన్‌గా బైపల్లి కూర్మమ్మ, డైరెక్టర్లుగా మరో 11 మందిని నియమించినట్లు ఆయన తెలిపారు. నూతన కార్యవర్గానికి స్థానిక నాయకులు అభినందనలు తెలియజేశారు.

మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న ఎస్ఐ గణేష్

### మజ్జిగ పంపిణీ

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

నగరంలోని సూర్యమహల్ కూడలి పెట్రోల్ బంక్ వద్ద జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని వన్ టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ ప్రారంభించారు. వారం రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉందని, గ్రామీణ ప్రాంతాల నుంచి అవసరాల కోసం నగరానికి వస్తున్న ప్రజలు ఎండ వేడికి తాళలేక అవస్థలు పడుతున్నారని అన్నారు. వారితో పాటు నగర వాసులు మధ్యాహ్నం సమయంలో దాహార్తికి గురి కాకుండా చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేస్తున్న జిల్ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో జిల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యసాయి, సభ్యులు సంతోష్, శివ, ఉమ, అఖిలభారత బ్రాహ్మణుల యువజన సంఘం అధ్యక్షుడు జాడ సాయి, జెసిఐ గ్రీన్‌సిటీ మణిశర్మ, పెట్రోల్ బంక్ యజమాని హనుమంతు కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

మానవహారం చేపడుతున్న విద్యార్థులు

### కిరణ్‌చంద్‌కు నివాళి

**ప్రజాశక్తి- కవిటి**

పదో తరగతి విద్యార్థి కిరణ్‌చంద్ ఆశయం హిమశిఖరమని బొరివంక గ్రామస్తులు అన్నారు. జోహార్ కిరణ్ చంద్ జోహార్ అంటూ కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాల విద్యార్థులు మానవహారం చేపట్టారు. బొరివంకలో యువకులు మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు, కళ్యాణి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత లోళ్ల రాజేష్ మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన కిరణ్ చంద్ తల్లిదండ్రులు తీసుకున్న అవయువ దానం నిర్ణయం అభినందనీయం, అనుసరణీయమని అన్నారు.

## కుక్కలకు కు.ని శస్త్రచికిత్సలు

సమీక్షిస్తున్న కమిషనర్ ఓబులేసు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

నగరపాలక సంస్థ పరిధిలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉండడంతో ఎబిసి, ఎఆర్‌వి కార్యక్రమంలో భాగంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. ప్రోగ్రాం అమలుపై కార్యాలయంలోని తన ఛాంబరులో అధికారులతో మంగళవారం సమీక్షించారు. జిల్లాలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల కొరత కారణంగా వీధి కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్లు గ్రీన్‌మెర్సీ సంస్థ నిలుపుదల చేసిందని అన్నారు. దీనివల్ల వీధి కుక్కల బెడద నగరంలో ఎక్కువైందని పేర్కొన్నారు. అందువల్ల పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో మోనటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ జి.వెంకటరావు, పశు సంవర్ధకశాఖ ఎడి డాక్టర్ వై.వి.కృష్ణారావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఆర్.హేమంత్‌కుమార్, గ్రీన్‌మెర్సీ ఇడి కె.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

## రణస్థలం సర్పంచ్‌కు సన్మానం

**ప్రజాశక్తి- రణస్థలం రూరల్**

భానోజీనాయుడును సన్మానిస్తున్న లోకేష్

ప్రభుత్వం నుంచి పంచాయతీలకు ఎటువంటి నిధులు రాకపోయినా సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు రణస్థలం పంచాయతీని అభివృద్ధి పథంలో నడిస్తున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. కర్నూలు జిల్లా ఆదోనిలో నిర్వహించిన యువగళంలో పల్లె ప్రగతి కోసం మీ లోకేష్ కార్యక్రమంలో భానోజీనాయుడు మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో అత్యధిక మెజారిటీతో సర్పంచ్‌గా గెలుపొంది అభివృద్ధి పథకంలో దూసుకుపోతున్నారని అన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకొస్తానని హామీనిచ్చారు. అనంతరం భానోజీనాయుడుకు దుశ్శాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్, ఎంపిటిసి మజ్జి వెంకటరమణ, రాష్ట్ర కమిటీ సభ్యులు, పైడి భీమవరం సర్పంచ్ ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు, ఎ.రామకృష్ణ, మధుపాం సర్పంచ్ బోగాది అప్పలనాయుడు పాల్గొన్నారు.

### సర్పంచ్‌లకు సన్మానం

**కొత్తూరు :** పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో భాగంగా ఇటీవల పలువురు సర్పంచ్‌లు ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం వారికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా తమ తమ పంచాయతీలను అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, జెడ్‌పిటిసి కమక భాగ్యవతి, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, ఎంపిడిఒ ఎం.పావని, తహశీల్దార్ పి.బాల, ఉపాధ్యక్షులు మెండల సునీత పాల్గొన్నారు.

## సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలి

**టెక్కలి రూరల్:** ప్రతిఒక్కరూ పచ్చదనం-పరిశుభ్రతను పాటించాలని టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు కోరారు. ఐతమ్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన కొత్తూరులో ప్రత్యేక సేవా శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ శిబిరం ఈ నెల 30 వరకు నిర్వహిస్తున్న పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడం ద్వారా సమాజంపై అవగాహన, నాయకత్వ లక్షణాలు విద్యార్థులకు అలవడతాయని అన్నారు. డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ బి.బలరాం, గ్రామస్తులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొని పరిశుభ్రత-పచ్చదనంపై ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్య పరిచారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

## గ్రామాలకు తాగునీరు అందించాలి

**ప్రజాశక్తి- కంచిలి**

వేసవి తీవ్రతలు ఒకవైపు, కిడ్నీ సమస్యలు మరోవైపు పట్టిపీడిస్తున్న ఉద్దానంలోని గ్రామాలకు తాగేందుకు నీటిని అందించాలని పెద్దశ్రీరాంపురానికి చెందిన ఎంపిటిసి విమల అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పైల దేవదాస్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతిని, రానున్న రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను గురించి సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మాదిన మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వం హయంలో ఉద్దానంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా ఉండేందుకు ఎన్‌టిఆర్ సుజల ధార పేరిట రక్షిత తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేసి గ్రామాలకు తాగునీటిని అందించారని అన్నారు. ప్రస్తుతం కంచిలి మండల పరిధిలోని ప్రధానపుట్టుగ, బూరగాం, బసవపుట్టుగా ఇలా సుమారు 13 గ్రామాల్లో సుజలధార పథకాలు మూలకు చేరాయి అన్నారు. కిడ్నీ వ్యాధి గ్రస్తుల కోసం ఎన్నో చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం కనీసం తాగునీటి సరఫరాకు ప్రయత్నం చకపోవడం దురదృష్టకరమన్నారు. తాగునీటి పథకాలకు పేర్లు మార్చైనా సరే పేదలకు తాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న ఎంపిటిసి విమల

## ఉత్తమ ఫలితాలు సాధించాలి

### పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

పాలిటెక్నికల్ ఎంట్రన్స్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. పాలిటెక్నికల్ ఎంట్రన్స్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు కళాశాలలో ఉచిత శిక్షణ అందిస్తున్నామని అన్నారు. పాలిటెక్నికల్ కళాశాల సిబ్బందితో కలిసి విద్యార్థులకు మెటీరియల్‌ను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక విద్య అనేది ప్రగతికి మెట్లని అన్నారు. బోధనలో అర్థం చేసుకుని జరగబోవు ఎంట్రన్స్ పరీక్ష బాగా రాసి ఉత్తమ ఫలితాలు పొందాలన్నారు. నేడు సాంకేతిక విద్యకు అధిక ప్రాధాన్యత ఉందని, విద్యార్థులు ఆ దిశగా ప్రయాణించడం అభినందనీయమని అన్నారు. తమ కళాశాలలో మంచి బోధనా సిబ్బంది ఉన్నారని చెప్పారు. ఎంట్రన్స్ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించిన వారు తమకు నచ్చిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఆధిపతి అన్నెపు గోపి, ఇతర విభాగాలు అధిపతులు పాల్గొన్నారు.

మెటీరియల్స్‌ను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

### ఆన్‌లైన్ విధానంపై అవగాహన

**టెక్కలి :** ప్రస్తుతం మార్కెట్‌లో కొనసాగుతున్న డిజిటల్ లావాదేవీలు ప్రక్రియలో భాగంగా బ్యాంకులో అందిస్తున్న సేవలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ఎం.రవికుమార్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ అధ్యక్షతన జాతీయ సేవా విభాగం ఆధ్వర్యాన మండలంలోని మోదుగువలసలో నిర్వహించిన జాతీయ సేవా శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. డిప్యూటీ మేనేజర్ ఎ.మధుసూదనరావు, ఎన్ఎస్ఎస్ పిఒ, అధ్యాపకులు కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కురుస్తున్న వర్షం

### కొత్తూరులో భారీ వర్షం

**కొత్తూరు :** మండలంలోని మంగళవారం రాత్రి గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో మురుగునీరంతా రోడ్లపై ప్రవహించింది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ వర్షం కురిసే సమయంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పగలంతా వేడిగాలులతో, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజానీకానికి ఈ వర్షంతో వాతావరణం చల్లబడింది. అపరాల పంటకు అనువుగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. మామిడి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు.

## రైల్వే ప్లైఓవర్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌మూర్తి

**ప్రజాశక్తి- పలాస**

శరవేగంగా నిర్మిస్తున్న పలాస రైల్వే ప్లైఓవర్ వంతెన నిర్మాణ పనుల నాణ్యతలను పరిశీలించాకే బిల్లులు చెల్లిస్తామని క్వాలిటీ కంట్రోల్ ఎస్ఇ ఆర్.శ్రీనివాస్‌మూర్తి అన్నారు. కాశీబుగ్గ రైల్వే ప్లైఓవర్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు పనులు చేస్తున్న కార్మికులకు పలు సూచనలు చేశారు. నిర్మాణం జరిగిన పనులు కొలతలను తీసుకున్నారు. వంతెన ఎంత వెడల్పు ఉంది, పిల్లర్లు నిబంధనలకు అనుగుణంగా నిర్మించరా? లేదా? తదితర అంశాలను పరిశీలించారు. నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట డిఇఇ రామచంద్రరావు, జెఇ శ్రీనివాసరావు, ఎఒ జగదీష్, ఆర్‌అండ్‌బి ఇఇ సత్యనారాయణ, డిఇఇ రామానాయుడు, జెఇ విక్రం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామదేవత సంబరాలు

**ప్రజాశక్తి- ఇచ్ఛాపురం**

ఇచ్ఛాపురం పట్టణంలో శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారు సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నెల 17న అర్ధరాత్రి నుంచి ప్రారంభించిన ఉత్సవాలు రోజూ విజవంతంగా కొనసాగుతుంది. నిత్యం సాయంత్రం ఉత్సవ మండపం నుంచి తిరువీధి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ సంస్కృతి కార్యక్రమాలు, కాళిక, కోలాటాకం, తప్పెడుగుళ్ళు, బుట్టబొమ్మలు నృత్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రణాళికాబద్ధంగా పట్టణంలోని అన్ని వీధిల్లో అమ్మవారు తిరువీధి జరిగే విధంగా రూపకల్పన చేశారు. తిరువీధి జరిగే వీధుల్లో రంగు రంగుల ముగ్గులతో అలంకరించి అమ్మ వారికి స్వాగతం పలుకుతున్నారు. ఈ ఉత్సవాలకు తిలకించడానికి సుదూర ప్రాంతాలను తరలివస్తున్నారు. దీంతో బంధువులతో ప్రతి ఇళ్లు కళకళలాడుతుంది. రోజురోజుకూ పట్టణంలో జన సంచారం పెరుగుతుంది. రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. మంగళవారం మేదరవీధి, ముత్యాలమ్మపేట, జామి ఎల్లమ్మ, జర్నలిస్టు కాలనీ, పండా కాలనీ, సంతపేట, కోట వీధి, మసీద్ వీధుల్లో తిరువీధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు, అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

తప్పెటగుళ్లు కళాకారుల ప్రదర్శన

# ప్రభుత్వానికి సెల్ఫీల ఛాలెంజ్

కవిటి : సుజల స్రవంతి వాటర్ ట్యాంకు వద్ద వాసుదేవ్ సెల్ఫీ

**ప్రజాశక్తి- కవిటి**

వైసిపి ప్రభుత్వానికి నిజంగా కిడ్నీ బాధితులపై ప్రేమ ఉంటే టిడిపి ప్రభుత్వ హయాంలో ముందు చూపుతో ఏర్పాటు చేసిన సుజల స్రవంతి పథకం ద్వారా అందించే శుద్ధజలాన్ని ఎందుకు ఆపేశారని టిడిపి బిసి కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ కొర్రాయి వాసుదేవ్ ప్రశ్నించారు. ఇదేనా మీ అభివృద్ధి, ఇంతేనా మీ పారదర్శకత అన్న వచ్చాడు. శుద్ధ జలం ఆపాడు అంటూ వాసుదేవ్ సెల్ఫీ ఛాలెంజ్ మంగళవారం విసిరారు. ఉద్దానం ప్రాంతంలో ముఖ్యంగా కిడ్నీ బాధితులను దృష్టిలో పెట్టుకొని ప్రతి పేదవాడికీ మినరల్ వాటర్ అందించే లక్ష్యంతో 2014న టిడిపి హయాంలో ప్రారంభించారని అన్నారు. యుద్ధప్రాతిపదికన పల్లెల నుంచి పట్నాల వరకు మినరల్ వాటర్ ప్లాంట్లను నెలకొల్పిందని అన్నారు. వైసిపి ప్రభుత్వం కూల్చివేతలతో పాలన ప్రారంభించి, చివరికి కిడ్నీ బాధితులకు శుద్ధజలం కూడా దూరం చేసిందని వాసుదేవ్ ఆరోపించారు. పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని టిడిపి ప్రభుత్వం కొన్ని వేల కోట్ల రూపాయలతో రూపొందించిన సుజల స్రవంతి పథకం నిలిపివేయడం కిడ్నీ బాధితులపై కక్ష సాధింపేనని, దీనిపై వైసిపి నాయకులు ప్రజలకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.

**ఇచ్ఛాపురం :** రాష్ట్రంలో ఏ పేదవాడు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో రూ.5కే నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్న క్యాంటీన్లను టిడిపి ప్రభుత్వం పెట్టిందని, వైసిపి ప్రభుత్వం వచ్చాక అవి మూతవేశారని టిడిపి తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల జయదేవ్ అన్నారు. ఈ మేరకు మూతపడిన అన్న క్యాంటీన్ వద్దకు మంగళవారం వెళ్లి సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి అధికారంలో వచ్చిన నాలుగేళ్లలో పేదవాడి ఆకలి తీర్చే ఒక పథకమైనా, ఒక్క కార్యక్రమమైనా చేపట్టారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జగదీష్, సంతోష్, జన్నెల సంతోష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మూతపడిన అన్నా క్యాంటీన్ వద్ద టిడిపి నాయకుల సెల్ఫీ

కోటబొమ్మాళి : పాల్గొన్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

## ఘనంగా ఎండల వారాలు

**ప్రజాశక్తి- కోటబొమ్మాళి**

మండలంలోని నిమ్మాడలో ఏటా ఏప్రిల్‌లో ఆఖరి మంగళవారం ఎండల వారాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మంగళవారం ఎండల వారాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపట్నం అమ్మవారు, నీలమ్మతల్లి, అసిరితల్లి అమ్మవారుల చల్లదనానికి మహిళలు ముర్రాటలు పట్టుకుని వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కుటుంబ సభ్యులతో పాల్గొని నడుచుకుంటూ వెళ్లారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, ఎంపీ తల్లి కింజరాపు విజయమ్మ, టిడిపి జిల్లా యూత్ అధ్యక్షుడు మెండ దాలినాయుడు, నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్ పాల్గొన్నారు.

**టెక్కలి రూరల్ :** మండలంలో కొనుసుల కొత్తూరులో ఉన్న షిర్డీ ఆలయాలన్ని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడులు దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో కమిటీ సభ్యులు వీరికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, ఎల్.ఎల్.నాయుడు, చాపర గణపతిరావు, ఆలయ ధర్మకర్త వాకాడ భుజంగరావు దంపతులు పాల్గొన్నారు.

## సెల్ఫీలు కాదు... అభివృద్ధి చేయాలి

తాతారావు యాదవ్

**మందస :** మంత్రి సీదిరి అప్పలరాజు సెల్ఫీలు తీసుకోవడం కాదని, నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు యాదవ్ హితవుపలికారు. మందసలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గం అభివృద్ధిపై సెల్ఫీ ఛాలెంజ్‌ని టిడిపి తరఫున స్వీకరిస్తున్నామని, అయితే అరకొర పనులతో ఎప్పుడు పూర్తవుతుందో తెలియని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ తప్పితే చెప్పుకోవడానికి ఇంకేమైనా ఉందా? అని ప్రశ్నించారు. ఉద్దానం ప్రజల జీవనాధారమైన జీడి పిక్కలకు కనీస మద్దతు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. జీడి రైతుల కోసం మీరు ఏమి చేశారో చెప్పగలరా? అని ప్రశ్నించారు. 80 కేజీల జీడిపిక్కల బస్తా రూ.14 వేలు ఉంటే.. ఇప్పుడు రూ.8 వేలకూ కొనే నాథుడు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.3000 కోట్లు ధరల స్థిరీకరణ నిధులు నుంచి కేటాయించి పిక్కలన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారా 80 కేజీల బస్తా రూ.16 వేలకు ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి అప్పుడు సెల్ఫీ తీసుకుంటే తాము సంతోషిస్తామని అన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

## ధరలు నియంత్రించాలి

**కోటబొమ్మాళి:** ధరలను ప్రభుత్వం నియంత్రించకుంటే పోరాడుతామని మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ అన్నారు. మండలంలోని నారాయణవలస పంచాయతీలో ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. రైతులకు రాయితీతో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు నిలుపుదల చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ మహిళ అధ్యక్షులు పూజారి శైలజ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, పూజారి శైలజ, దేవాది సింహాద్రమ్మ, బాడాన రమణమ్మ, గొండ లక్ష్మణరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## ఎంపీ దృష్టికి సమస్యలు

**మెళియాపుట్టి:** మండలంలో పలు సమస్యలను టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ్ కోరారు. ఈ మేరకు ఎంపీ నివాసంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జాడుపల్లికి చెందిన మధ్యాహ్న భోజనం వంట కార్మికులు మల్లిపెద్ది రమా వంట చేస్తుండగా చీరకు నిప్పంటుకుని మృతి చెందిందని అన్నారు. ఆమె కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కోరారు. అలాగే సుర్జినికి చెందిన ఆదమ్మ, రంగయ్యకు చెందిన ఐదెకరాల జీడి, మామిడి, టేకు కాలిపోయిందని, వారిని ఆదుకోవాలని విన్నవించారు. మహిళా జిల్లా ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి, జాడుపల్లి ఎంపిటిసి కదంబల సుజాత, పైడిరాజు, మండల తెలుగు యువత అధ్యక్షులు పరమేశ్వరరెడ్డి, వల్లభ, కోదండరావు పాల్గొన్నారు.

## ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దుర్యోధన

**ప్రజాశక్తి- పలాస**

విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను కేంద్ర ప్రభుత్వం ఆపాలని, వాటిని ప్రతిఒక్కరూ ఉద్యమించి కాపాడుకుందామని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన పిలుపునిచ్చారు. కాశీబుగ్గ ఆశ్రమ వద్ద 137వ మేడే పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న పెట్రోల్, గ్యాస్, డీజిల్, విద్యుత్, బస్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలన్నారు. రాష్ట్రంలో మూతడిన సిమెంట్ ఫ్యాక్టరీలు, జ్యూట్ మిల్లులు తక్షణమే తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జిఒ 1ని తక్షణమే రద్దు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మేడు సందర్భంగా మే 1 నుంచి 5 వరకు గ్రామాల్లో గ్రామసభలు, ప్రదర్శనలు, ఎర్ర జెండల ఆవిష్కరణలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షులు దేవాడ నారాయణమూర్తి, కారి పురుషోత్తం, మురిపింటి రాజారావు, కె.లోకనాథం, వై.జోగారావు, మద్దిల ధర్మారావు, పి.హరికృష్ణ పాల్గొన్నారు.

జ్ఞాపికను స్వీకరిస్తున్న చిరంజీవి

## అరసవల్లి సందర్శన

**శ్రీకాకుళం అర్బన్ :** అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని ఆప్కో రాష్ట్ర చైర్మన్ గంజి చిరంజీవి మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి, ఆప్కో అధికారులు పాల్గొన్నారు.

## పాత శిలాఫలకాలకు కొత్త రంగులు

**పొందూరు:** మడ్డువలస కాలువ ఫేజ్-2 పనులకు సంబంధించి పాత శిలాఫలకాలకు కొత్త రంగులు వేయడంతో వైసిపి మంత్రులు, స్పీకర్లు ప్రజలకు తీరు మసిపూసి మారేడుకాయ చెప్పేవిధంగా ఉందని టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు అన్నారు. పొందూరు మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మంత్రి బొత్స సత్యనారాయణ 12 ఏళ్ల క్రితం జి.సిగడాం మండలం మదుపాం వద్ద ఇదే కాలువకు శిలాఫలకం వేశారని, మరలా ఇప్పుడు శిలాఫలకం వేయడం ప్రజలను మభ్యపెట్టడం కాదా? అని ప్రశ్నించారు. గతంలో ఈ మడ్డువలస పనులకు సంబంధించి భూసర్వే నిర్వహించగా, నాలుగేళ్ల అవుతున్నా ఇరిగేషన్ మంత్రి, ఇన్‌ఛార్జి మంత్రి, స్పీకర్లు ఈ పనులపై నిమ్మకునీరెత్తనట్లుగా ఉన్నారని అన్నారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడడంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఈ విధంగా శంకుస్థాపన చేశారని అన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, పొందూరు ఎంపిటిసి-4 ప్రతినిధి బాడాన శేషగిరినాయుడు, మాజీ సర్పంచ్‌లు బొడ్డేపల్లి సత్యం, గురుగుబెల్లి జగన్నాథం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**ప్రజాశక్తి- కవిటి**

పరిసరాల పరిశుభ్రతతోనే అనేక వ్యాధులను నివారించవచ్చని బెలగాం ప్రభుత్వాస్పత్రి వైద్యులు పి.రాజేష్, డి.కవిత అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని బెలగాంలో మలేరియాపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యం, అపరిశుభ్రతే అనారోగ్యం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎం.కృష్ణారావు, హెచ్ఇ బి.మంగమ్మ, పి.హెచ్.ఎన్.టి.మంగమ్మ, ఎల్.టి.బి.శివప్రసాద్, హెచ్‌విడబ్ల్యు టి.భారతి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తోనే మలేరియా దూరం

**జలుమూరు:** మనం నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే మలేరియా నుంచి దూరంగా ఉండవచ్చని జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పిస్తూ... ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చల్ల వంశీకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నరాజులు, ఎస్.పద్మావతి పాల్గొన్నారు.

**మెళియాపుట్టి :** మలేరియాపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారిని గ్రీష్మ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సి నుంచి మూడు రోడ్ల కూడలి వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

జలుమూరు : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది